క్లుప్తంగా

వెండి మండపం పరిశీలన



నూతన వెండి మండపాన్ని పరిశీలిస్తున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం రూరల్: రాఘవేంద్రస్వామి మఠంలో మూలరాముల పూజ జరిగే మందిరంను వెండితో తయారు చేయించారు. శ్రీ రామనవమి సందర్భంగా వెండి పూజ మండపంలో పూజ చేసేందుకు మండపం తయారు చేయించినట్లు పీఠాధిపతి శ్రీ సుబుధేంద్రతీర్థులు తెలిపారు. గురువారం వైఎస్సార్‌సీపీ నేత వై.సీతారామిరెడ్డితో కలిసి పూజ మండపంను పరిశీలించారు. భక్తులు సమర్పించిన కానుకలు, శ్రీ మఠం తరపున కొంత నగదు ఖర్చు చేసి మండపం తయారు చేయించినట్లు అధికారులు తెలిపారు.

జిల్లా డాక్టర్ల విభాగం అధ్యక్షుడిగా కృష్ణమూర్తి



ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలియజేస్తున్న డాక్టర్లు

ఆదోని టౌన్: వైఎస్సార్‌సీపీ జిల్లా డాక్టర్ల విభాగం అధ్యక్షుడిగా ఆదోనికి చెందిన ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ ఓ.ఎం.కృష్ణమూర్తి నియమితులయ్యారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే నివాసంలో డాక్టర్లు, పార్టీ నాయకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఓఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ జిల్లా డాక్టర్ల విభాగం అధ్యక్షుడిగా తనను ఎంపిక చేయడం, నిరుపేదలకు సేవలు చేసుకునే అవకాశం కల్పించిన ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

కౌతాళం దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు



స్వామి వారి సమాధి వద్ద పూజలు చేస్తున్న భక్తులు

కౌతాళం: మండల కేంద్రంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు, ప్రార్థనలు జరిపి స్వామికి పూలచాదర్‌ను సమర్పించారు. దీంతో దర్గా పరిసర ప్రాంతాల్లో భక్తులతో సందడి నెలకొంది. భక్తులు దర్గాలోని మసీదులో ఇఫ్తార్ పూర్తి చేసుకుని నమాజు ఆచరించారు. అంతకుముందు తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాష చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు. భక్తులకు అన్నదానం చేశారు.

ఎల్లార్తి దర్గాల్లో ఫాతెహాలు

హొళగుంద: మండల పరిధిలోని ఎల్లార్తి షేక్షావలి, షాషావలి దర్గాలను గురువారం భక్తులు దర్శించుకుని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే హొళగుంద సాయిబన్న, చిణిగితాతా దర్గాలు, షిర్డి సాయి బాబా ఆలయాలను భక్తులు దర్శనం చేసుకున్నారు. తీర్థ ప్రసాద పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.

సర్వీసు రూల్స్‌లో సవరణలు చేయాలి

ఆదోని అర్బన్: మున్సిపల్ ఉపాధ్యాయుల యూనిఫైడ్ సర్వీస్ రూల్స్‌లో సవరణలు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి నాగరాజు, రాష్ట్ర నాయకులు లోక్య నాయక్, వీరచంద్రయాదవ్ కోరారు. గురువారం స్థానిక నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో మున్సిపల్ ఉపాధ్యాయుల యూనిఫైడ్ సర్వీస్ డ్రాఫ్ట్ రూల్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులకు జీపీఎఫ్ సౌకర్యం కల్పించాలని, బదిలీల్లో ఉపాధ్యాయుల కార్పొరేషన్, మున్సిపాలిటీ కోరుకునే స్వేచ్ఛను కల్పించాలని కోరారు. నాయకులు ఉరుకుందప్ప, ప్రహ్లాద్, సుధాకర్, విక్టర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గుడిసె దగ్ధం

మంత్రాలయం రూరల్: మండల పరిధిలోని మాధవరం గ్రామంలో బొగ్గుల నరసన్న ఇంట్లో అనుకోకుండా మంటలు వ్యాపించి రెండు గుడిసెల్లో మంటలు చెలరేగాయి. స్థానికులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించగా వీలు కాలేదు. సమాచారం అందుకున్న ఎమ్మిగనూరు అగ్నిమాపక అధికారులు రంగప్రవేశం చేసి మంటలు అదుపుచేశారు. అగ్నిప్రమాదంలో రూ.5 లక్షల మేర పత్తి దిగుబడులు, ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు మాధవరం పోలీసులు తెలిపారు



కోసిగిలో పూజలందుకుంటున్న ఉత్సవమూర్తులు



ఆంజనేయ స్వామి సన్నిధిలో పూజలు చేస్తున్న భక్తులు



రంగాపురంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం



మంత్రాలయంలో సీతారాముల కల్యాణం



మంత్రాలయంలో స్వామివారిని దర్శించుకునేందుకు క్యూలో వేచిఉన్న భక్తులు

సీతారాముల కల్యాణ వైభోగం

- ఘనంగా శ్రీరామనవమి వేడుకలు
- శ్రీరామ నామస్మరణతో మార్మోగిన ఆలయాలు



ఆదోని విక్టోరియాపేటలో ప్రత్యేకాలంకరణలో దర్శనమిస్తున్న సీతారామ లక్ష్మణ స్వామివారు



కౌతాళంలో కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు



ఆదోని: విక్టోరియాపేట కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

ఆదోని అర్బన్: శ్రీరామనవమి సందర్భంగా గురువారం పట్టణంలోని ఆయా వీధుల్లో శ్రీరామ, వైష్ణవ ఆలయాల్లో వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. సీతారాముల కల్యాణోత్సవానికి ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేశారు. స్థానిక విక్టోరియా పేటలో వెలిసిన కోదండ రామాలయంలో ఆలయ నిర్వాహకుడు రఘుప్రేమ ఆధ్వర్యంలో సీతారామ ఆంజనేయస్వామి వార్లకు ఫల పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం, వెండి, పూల అలంకరణతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సంప్రదాయబద్ధంగా సీతారాముల కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో పల్లకీసేవ, రథోత్సవం నిర్వహించారు. అదేవిధంగా ఇందిరానగర్ వెలిసిన వెంకటేశ్వర స్వామి ఆలయంలో, మంగరాయ ఆంజనేయ స్వామి సన్నిధిలో, కోటవీరభద్రేశ్వర స్వామి వద్ద సీతారామ నగర్‌లో స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేసి, సీతారాముల కల్యాణం నిర్వహించారు.

కోసిగి: మండల కేంద్రంలో గురువారం శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కోసిగి రైల్వేస్టేషన్ రోడ్డులో వెలసిన రామాలయంలో ఆలయ ధర్మకర్తలు వేకువజామున నుంచి సీతారాములకు జలాభిషేకం, పంచామృతాభిషేకం, ఆకు పూజ, మహామంగళ హారతులు గావించి ప్రత్యేక పూజలు చేపట్టారు. వేదపండితులు మూర్తి స్వామి నేతృత్వంలో భక్తుల మధ్య వేదమంత్రాలు పఠిస్తుండగా మేళతాళాలు, డప్పు వాయిద్యాల మధ్య సీతారాముల కల్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. భక్తులు స్వామి వారికి నారికేళాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

➡ కోసిగి రంగప్ప గట్టు సమీపంలో వెలసిన ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రీరామ నవమి వేడుకలు కడు వైభవంగా నిర్వహించారు. ఎంపీపీ ఈరన్న, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు నాడుగేని నరసింహులు ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తాదులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రాత్రి ప్రత్యేక భక్తి భజన పాటలతో అలరించారు. పూజల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు బసిరెడ్డి, నాడుగేని వీరారెడ్డి, తాయన్న, జంపాపురం సర్పంచ్ ఆరోన్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దకడబూరు: మండలంలోని అన్ని గ్రామాలలో శ్రీరామ నవమి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. రంగాపురం, హులికన్వీ, గంగులపాడు, నాగులాపురం, పెద్దకడబూరు, తారాపురం, బసలదొడ్డి తదితర గ్రామాలలో సీతారాముల కల్యాణం ఘనంగా జరిపించారు. ఆయా గ్రామాల లో హోమాలు వంటి ప్రత్యేక పూజలు నిర్వహించా రు. స్వామివారి ఫొటోలతో ర్యాలీ నిర్వహించారు.

➡ మండల పరిధిలోని హెచ్.మురవణి గ్రామంలో సీతారాముల రథోత్సవం శుక్రవారం జరుగనున్నట్లు ఆలయ అర్చకులు సత్యనారాయణ స్వామి, మూర్తిస్వామి తెలిపారు. మండల ప్రజలందరూ హాజరై స్వామివారి ఆశీస్సులు పొందాలన్నారు.

మంత్రాలయంలో వైభవంగా శ్రీరామనవమి వేడుకలు

మంత్రాలయం రూరల్: శ్రీరామనవమి సందర్భంగా వైఎస్సార్‌సీపీ నేత వై.సీతారామిరెడ్డి గురువారం ముందుగా గ్రామ దేవత మంచాలమ్మను, శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈయనకు పీఠాధిపతి శ్రీ సుభుదేంద్రతీర్థులు శేషవస్త్రం, స్వామి వారి మెమొంటో, ఫలమంత్రాక్షింతలిచ్చి ఆశీర్వదించారు. అదేవిధంగా కాచాపురం గ్రామ శివారులోని కట్టెఅనుమప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈయనతో పాటు శ్రీమఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపీ.నరసింహమూర్తి, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య తదితరులు ఉన్నారు.

మంత్రాలయం రూరల్: మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి మఠం, పాతవూరులో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు వైభవంగా జరిగాయి. పీఠాధిపతి శ్రీ సుభుదేంద్రతీర్థులు మూలరాములకు ఫల, పుష్ప, క్షీర, పంచామృతాభిషేకాలు నిర్వహించిన అనంతరం రాఘవేంద్రస్వామి మూలబృందావనంకు విశేష పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు క్యూలైన్లో బారులు తీరారు. అదే విధంగా పాతవూరులోని ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేపట్టి సీతారాముల కల్యాణం జరిపించారు. అనంతరం ప్రత్యేక పల్లకీలో సీతారాముల విగ్రహాలను కొలువుంచి గ్రామ పుర విధుల్లో ఊరేగించారు. కర్నూలు జిల్లా అర్చక సమాఖ్య ప్రతినిధి సూర్యనారాయణచార్యులు, మధుసూదన్‌చార్యులు, శ్రీనివాసచార్యులు, సత్యనారాయణచార్యులు తదితరులు ఉన్నారు.

కౌతాళం: మండలంలోని వివిధ గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు గురువారం వైభవంగా జరిగాయి. సుళేకేరిలోని బుడుములదొడ్డి అంజనేయస్వామి దేవాలయంలో, కుంబళనూరు క్యాంపు, చూడి క్యాంపులో, రాజనగర్ క్యాంపులో, నదిచాగి గ్రామంలోని అంజనేయస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, గంధపుసేవ, పాలభిషేకం, పంచామృతాభిషేకం చేపట్టారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తుల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు

ఆదోని రూరల్: వైద్యులు, సిబ్బంది రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని, ఆదోని ఏరియా ఆస్పత్రి, స్త్రీలు, చిన్నారుల ఆస్పత్రిలో వస్తున్న ఫిర్యాదులపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు ఎస్.గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు వైద్యం అందించేందుకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుండగా కింది స్థాయి ఉద్యోగులు, వైద్యులు ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చే విధంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి రోగులను రెఫర్ చేయాలే గానీ, అనవసరంగా రెఫర్ చేయరాదన్నారు. కొందరు వైద్యులు ప్రయివేట్ ల్యాబ్‌లకు పంపిస్తున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్యులు ప్రయివేట్ క్లినిక్‌లు నిర్వహిస్తూ ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నట్లు వస్తున్న ఆరోపణలపై ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రి అంటే రోగులకు భరోసాగా ఉండాలే గానీ వారిని ఇబ్బందులకు గురిచేసేలా ఉండరాదన్నారు. ఇకనైనా వైద్యులు, వైద్యసిబ్బంది పద్ధతి మార్చుకోవాలన్నారు. లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు.

బాలుడి ఆరోగ్యానికి భరోసా

- సీఎం సహాయనిధి కింద ఆపరేషన్ చేసేందుకు సిఫార్సు
- వైద్యఖర్చుల కోసం రూ.50 వేలు అందించిన ఎమ్మెల్యే సాయి



ఆపరేషన్ చేసేందుకు డిక్లరేషన్ పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిటౌన్: ఆదోని మండలం గోనబావి గ్రామానికి చెందిన ఐదేళ్ల బాలుడి ఆరోగ్యానికి ప్రభుత్వం అండగా నిలిచింది. బాలుడి తల్లిదండ్రులు బోయ లింగన్న, లక్ష్మి తెలిపిన వివరాల మేరకు.. వారి రెండో కుమారుడు నందకిషోర్ (5) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. తల్లిదండ్రులు ఆదోని, కర్నూలులో వైద్యం చేయించగా ఊపిరితిత్తుల జబ్బు ఉన్నట్లు బయటపడింది. ఆపరేషన్ చేయాలని, సుమారు రూ.18 లక్షల దాకా ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. ఆర్థిక స్థోమత లేని ఆ దంపతులు గ్రామ నాయకుడు నకతే శ్యామ్‌ప్రసాద్ దృష్టికి తీసుకొచ్చారు. ఆయన, వారితో కలిసి ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిని ఆశ్రయించి బాలుడి ఆరోగ్య పరిస్థితిని వివరించారు. చలించిన ఎమ్మెల్యే బాలుడి వైద్యం కోసం విజయవాడలోని రెయిన్‌బో ఆస్పత్రికి సిఫారసు చేశారు. సీఎం సహాయనిధి కింద ఆపరేషన్ చేయాలని కోరగా ఆస్పత్రి యాజమాన్యం అంగీకరించింది. ఆపరేషన్‌కు సంబంధించిన డిక్లరేషన్ పత్రాన్ని గురువారం ఎమ్మెల్యే బాలుడి తల్లిదండ్రులకు అందజేశారు. ఆపరేషన్ చేయించుకుని బాలుడు కోలుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. వైద్య ఖర్చుల కోసం తక్షణ సాయంగా రూ.50 వేలను అందజేశారు. సహాయ, సహకారాలు అందించిన ఎమ్మెల్యేకు ఆ కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

నిబంధనల అతిక్రమణపై చర్యలు తీసుకోవాలి

ఆదోని అర్బన్: ప్రభుత్వ సెలవు దినాల్లో క్లాసు లు నిర్వహిస్తున్న ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని రాయలసీమ పరిరక్షణ స్టూడెంట్ ఫెడరేషన్ డివిజన్ అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు నవీన్, బాలు విద్యాధికారులను కోరారు. గురువారం శ్రీరామనవమి ప్రభుత్వం సెలవుదినం రోజున పాఠశాలలు నిర్వహిస్తున్న ప్రయివేట్, కార్పొరే ట్ పాఠశాలలను బంద్ చేయించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులను మా నసిక ఒత్తిడికి గురి చేస్తున్న పాఠశాలలపై అధికారులు చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం వహి స్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ సెలవు దినాల్లో క్లాసులు నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు వీరనాగేంద్ర, ప్రవీణ్, శివ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.





పెద్దతుంబళంలో సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ దంపతులు, విగ్రహాల ఊరేగింపునకు సిద్ధం చేసిన దృశ్యం

మిర్చి దిగుబడులు అపహరణ

కోసిగి: మండల పరిధిలోని సజ్జలగుడ్డం గ్రామంలో రైతులు మేకల చంద్ర, లక్ష్మికి చెందిన మిర్చి దిగుబడులను కల్లంలో ఆరబోయగా గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకు పోయినట్లు బాధితులు గురువారం కోసిగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితులు మాట్లాడుతూ.. తమకున్న నాలుగెకరాల పొలంలో బ్యాడిగి సీడ్ జంట (2043 హెచ్‌పీహెచ్) రకం మిరప పంటను సాగుచేసినట్లు తెలిపారు. పంట కాపునకు రావడంతో కోత కోసి దిగుబడులను పొలంలో ఆరబెట్టినట్లు చెప్పారు. బుధవారం అర్ధరాత్రి దొంగలు పొలంలో ఆరబెట్టిన దాదాపు 4 క్వింటాళ్ల మిర్చి దిగుబడులను దోచుకెళ్లినట్లు బాధితులు వాపోయారు. వాటి విలువ ప్రస్తుత మార్కెట్ ఆధారంగా రూ.3 లక్షలు ఉంటుందని తెలిపారు. గ్రామానికి చెందిన కొందరు ఆకతాయిలు దొంగతనం చేసి ఉండవచ్చునని అనుమానం వ్యక్తం చేశారు. దొంగలను పట్టుకుని న్యాయం చేయాలని కోరారు.



పొలంలో మిగిలిన మిర్చి దిగుబడి

కల్యాణం.. కమనీయం

ఆదోని రూరల్: ద్వాపరయుగంలో పాండవులతో నిర్మితమైన నక్షత్ర మండలాకార శ్రీ కోదండ రామాలయం (మండలంలోని పెద్దతుంబళం గ్రామం)లో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మంత్రాలయం పీఠాధిపతి సుభుదేంద్రతీర్థులు ఉత్సవాలను ప్రారంభించగా ముగింపు రోజైన గురువారం శ్రీరామనవమి వేడుకలను భక్తులు, పురోహితులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు స్వామివారికి జలాభిషేకం, కుంకుమార్చన, మహామంగళ హారతి తదితర విశేష పూజలు నిర్వహించారు. అనంతరం సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని సాయంత్రం 6.30 గంటలకు చేపట్టారు. ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థాన పాలక మండలి, సిబ్బంది, ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ దంపతులు, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, విశ్వహిందూ పరిషత్ అధ్యక్షులు బసవన్న గౌడ్, ఉగ్రరమేష్, మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌జైన్, హిందూ ధర్మ రక్షణ నాయకుడు రాధామనోహర్ స్వామి తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఉచ్చప్ప ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం నుంచి రాత్రి 10 గంటల వరకు సీతారాముల విగ్రహాలను గ్రామ పురవీధులగుండా ఊరేగించారు. ఎస్‌ఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశంలోనే ఎక్కడా లేనివిధంగా ద్వాపర యుగంలో పాండవులు ఇక్కడికి వచ్చి అంత్యంత చరిత్రాత్మకమైన కోదండ రామాలయాన్ని నిర్మించారన్నారు. ఈ ఆలయంలో ఉత్సవాలు వైభవంగా నిర్వహించడంపై సర్పంచ్‌ను అభినందించారు.

మంత్రాలయం రూరల్: మండల పరిధిలోని మాధవరంలో శ్రీరామనవమి సందర్భంగా పల్లకి ఉత్సవం, సూగూరు గ్రామంలో ప్రభోత్సవం, చెట్నేహళ్లి గ్రామంలో భీమరాయ ప్రభోత్సవం నిర్వహించారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజు ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

వడదెబ్బ నివారణపై అవగాహన

ఆదోని టౌన్: వేసవికాలం దృష్ట్యా ప్రజలకు వడదెబ్బ, దాని ప్రభావం వల్ల ఆరోగ్య క్షీణతపై అవగాహన కల్పిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని 42 వార్డుల పరిధిలో వడదెబ్బ నివారణ చర్యలను వార్డు సచివాలయాల పరిధిలో ప్రజలకు వివరిస్తూ చైతన్యం కల్పిస్తున్నామన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వడదెబ్బ, దాని తీవ్రత పరిణామాలను ఎదుర్కొనేందుకు అర్బన్ హెల్త్ సెంటర్ల డాక్టర్లు, ప్రభుత్వ వైద్యులు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లలతో సమావేశాలు నిర్వహించి, తీసుకోవాల్సిన నివారణ చర్యలు, జాగ్రత్తలపై వివరించడం జరుగుతుందన్నారు. డాక్టర్ల సలహాలు, సూచనలు పాటించి వడదెబ్బ బారిన పడకుండా ఉండాలని పట్టణ ప్రజలకు సూచించారు. ఎండలు ఎక్కువగా ఉండడం వల్ల మధ్యాహ్నంలోపు పనులను ముగించుకుని ఇళ్లకు చేరుకోవాలన్నారు. సాయంత్రం ఐదు గంటల తర్వాత ఇళ్ల నుంచి బయటికి రావాలన్నారు.

వల్లూరు వృషభాల జయకేతనం

కృష్ణగిరి: మండలపరిధిలోని టి.గోకులపాడులో శ్రీరామనవమి సందర్భంగా రాష్ట్రస్థాయి వృషభాల బండ లాగుడు పోటీలను గురువారం ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. పోటీల్లో కోడుమూరు మండలం వల్లూరుకు చెందిన దొడ్డికాటి తిరుమలేష్ వృషభాలు విజేతగా నిలిచాయి. రెండవ స్థానంలో బేతంచర్లకు చెందిన మేకల వెంకటరాముడు వృషభాలు, మూడవ స్థానంలో గడివేముల మండలం పెసరవాయి సయ్యద్ కలాంబాషా వృషభాలు, నాల్గవ స్థానంలో ప్యాపిలి మండలం పీఆర్ పల్లె చిన్న నాగన్న వృషభాలు, ఐదవ స్థానంలో అనంతపురం జిల్లా, కందనకోట చెన్నప్ప వృషభాలు నిలిచాయి. గెలుపొందిన వృషభాల యజమానులకు దాతలు, వైఎస్సార్‌సీపీ నాయకులు తెలుగు మల్లేష్,ప్రభాకర్‌రెడ్డి, పూల రాజు, నీలకంఠి తిమ్మరాజు, గ్రామ వలంటీర్లు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల నగదు బహుమతులు అందించారు.

హత్య ఘటనపై కేసు నమోదు

కౌతాళం: మండల పరిధిలోని హాల్వి గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన ఉసేన్ బాషా హత్యకేసులో ముగ్గురు అనుమానితులపై కేసు నమోదు చేసినట్లు కోసిగి సీఐ ఏరిషావలి, కౌతాళం నరేంద్ర కుమార్ రెడ్డి తెలిపారు. మృతుని భార్య వన్నూర్‌బీ ఇచ్చిన ఫిర్యాదులో గ్రామానికి చెందిన చిన్న లక్ష్మినారాయణ కుమారులు ముగ్గురిపై అనుమానం వ్యక్తం చేసినట్లు చెప్పారు. స్థల వివాదం ఉండడంతో తన భర్తను వారే చంపిఉంటారని? లేదా ఇతర కారణం ఉండొచ్చని? ఫిర్యాదుతో పేర్కొనడంతో ఆయా కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. నేరస్తులను త్వరలోనే పట్టుకుని కేసు ఛేదిస్తామన్నారు. నిందితుల కోసం మూడు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.

ఘటన స్థలాన్ని పరిశీలించిన డాగ్ స్క్వాడ్

హత్య కేసు ఛేదనలో భాగంగా గురువారం ఉదయం క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఘటన స్థలంలో దొరికిన వస్తువులను సేకరించారు. డాగ్ స్క్వాడ్ గ్రామంలోని ప్రధాన రోడ్ల గుండా సంచరించి నదిచాగి రోడ్డు వైపు కొద్ది దూరంలో వెళ్లి ఆగిపోయాయి దీంతో నిందితులు కర్ణాటకలో తలదాచుకున్నట్లు భావిస్తున్నారు.



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం సిబ్బంది

మసీదు భూమిని స్వాధీనం చేసుకోవాలి

పెద్దకడబూరు: జామియా మసీదుకు చెందిన 72 ఎకరాల భూములను వక్ఫ్ బోర్డు అధికారులు స్వాధీనం చేసుకొని, మసీదును వక్ఫ్ బోర్డే అభివృద్ధి చేయాలని మండల కేంద్రంలోని ముస్లింలు రోడ్డెక్కారు. మండల కేంద్రంలో 80 సంవత్సరాల క్రితం జామియా మసీదును నిర్మించారు. మసీదుకు సంబంధించి 72 ఎకరాల పొలం ఉంది. గ్రామంలో మొత్తం 300 కుటుంబాలకు పైగా ముస్లింలు ఉన్నారు. మసీదుకు సంబంధించిన పొలం10 ఇళ్లకు చెందిన ముల్లా వారు మాత్రమే అనుభవిస్తున్నారు. అయితే మసీదును ఎలాంటి అభివృద్ధి చేయకుండానే,భూమిని చేసుకుంటున్నారని గురువారం ముస్లింలు మసీదు నుంచి ర్యాలీగా బస్టాండ్‌కు చేరుకుని ధర్నా చేపట్టారు. అక్కడ ముస్లింలు, ముల్లా వారి మధ్య స్వల్ప ఘర్షణ ఏర్పడింది. అక్కడి నుంచి స్థానికపోలీస్‌స్టేషన్ చేరుకున్న ముస్లింలు న్యాయం చేయాలంటూ బైఠాయించారు. మసీదులో ప్రార్థన చేస్తున్న ఇమాంకు రూ.5 వేలు జీతం ఇచ్చి సరిపెడుతున్నారని, ఈ జీతాలు ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. దీనిపై పలుమార్లు ముల్లాలకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. వక్ఫ్ బోర్డు అధికారులు చొరువ తీసుకుని ముల్లా వారి నుంచి భూమిని స్వాధీనం చేసుకొని మసీదును అధికారులే అభివృద్ధి చేయాలని కోరారు. ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.



పెద్దకడబూరు పోలీస్‌స్టేషన్ ముందు బైఠాయించిన ముస్లింలు

ఎమ్మెల్యేలను కొనడం బాబుకు కొత్తేమీ కాదు

మంత్రాలయం రూరల్: ఇతర పార్టీల ఎమ్మెల్యేలను కొనడం చంద్రబాబుకు కొత్తేమీ కాదని కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. గురువారం ఉదయం శ్రీరామనవమి సందర్భంగా ఆయన సోదరుడు శ్రీనివాసులుతో కలిసి రాఘవేంద్ర స్వామిని దర్శించుకునేందుకు మంత్రాలయం వచ్చారు. ముందుగా గ్రామదేవత మంచాలమ్మ, రాఘవేంద్ర స్వామి మూల బృందావనంకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. వీరికి మఠం పీఠాధిపతి సుభుదేంద్రతీర్థులు శేష వస్త్రం కప్పి, ఫలమంత్రాక్షింతలిచ్చి ఆశీర్వదించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు టీడీపీకి టచ్‌లో ఉన్నారనేది ఎల్లో మీడియా ప్రచారమేనని, అందులో వాస్తవం లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చానని చెప్పే ధైర్యం చంద్రబాబునాయుడు లేదని మండిపడ్డారు. 2024 ఎన్నికల్లో కూడా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. మఠం మేనేజర్ ఎస్‌కే.శ్రీనివాస రావు, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ.నరసింహమూర్తి, సీఐ శ్రీనివాసులు, ఎస్‌లు వేణుగోపాల్‌రాజు, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.



మంత్రాలయంలో పీఠాధిపతి నుంచి మెమొంటో స్వీకరిస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం